క్లుప్తంగా

నార్మల్ డెలివరీతో తల్లీ బిడ్డ క్షేమం



ర్యాలీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: నార్మల్ డెలివరీ ద్వారా తల్లీ బిడ్డకు కూడా పూర్తి ఆరోగ్యమని వైద్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి వైద్యులు నార్మల్ డెలివరీ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి వద్ద ర్యాలీని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలకు ప్రాముఖ్యత ఇవ్వాలని వైద్యులకు సూచించారు. ఇటీవల సిజేరియన్ ఆపరేషన్‌లు ఎక్కువయ్యాయని అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ జేసుప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

పెనుగొండ: కార్బన్, ఆర్క్ వెల్డింగ్ రూపకర్త నికోలామ్ బెనార్డోస్ 182వ జయంతి సందర్భంగా సీఐటీయూ అనుబంధ సంస్థ జై శ్రీ దుర్గా దేవి వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆచంట బస్టాండులో మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం నికోలామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కేతా నాగాంజనేయులు, కోశాధికారి కాంద్రేగుల కనకేశ్వర రావు, కుడిపూడి గోపాలకృష్ణ, కేతా రాంపండు, కేతా వెంకట కృష్ణ, మంచిగంటి నాగరాజు, కాంద్రేగుల వెంకటేశు, జుత్తిగ మహేష్ బాబు, మండి శివన్నారాయణ, కడలి ధర్మరాజు వాసంశెట్టి సోమరాజు, బొక్కా లక్ష్మీ నారాయణలు పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



జుత్తిగలో హోమ పూజ చేస్తున్న అర్చకులు

పెనుమంట్ర: వసంత నవరాత్రులను పురస్కరించుకుని జుత్తిగ గ్రామ దేవత జుత్తిగ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 9 రోజుల పాటు నిర్వహించే ఈ పూజా కార్యక్రమాల్లో ప్రతి రోజూ హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో భక్తులచే సహస్రనామ కుంకుమార్చనలు, చండీ, రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. వేదపండితులు వేమూరి వెంకట రవిరామచంద్ర ఆధ్వర్యంలో శ్రీరామనవమి వరకు హోమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి తెలిపారు. జ్యోతిష్య పండితులు వారణాసి రామమోహన్ తదితర పండితులు హోమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సంపత్‌కుమార్, తదితరులు

పెంటపాడు: అధికారంలోకి వచ్చి పది నెలలైనా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌పై హామీలు నీరుగారుతున్నాయని ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం దర్శిపర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుండుమోగుల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. గ్రామ కమిటీలపై చర్చించారు.

చలివేంద్రం ఏర్పాటు

తణుకు అర్బన్: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డు నంబరు 3 మునిసిపల్ పాఠశాల వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జె భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సమాజానికి ఉపయోగపడే విధంగా మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎదుటివారికి సాయపడే గుణాన్ని కలిగి ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్ మత్తయ్య, జైభీమ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

తిట్టారు.. తిరిగి అట్రాసిటీ కేసు పెట్టించారు

- మంత్రి నిమ్మల అధికార దుర్వినియోగం
- యలమంచిలి ఎంపీపీ ఉప ఎన్నికను అడ్డుకున్న వైనం
- వైఎస్సార్ సీపీ దళిత నేతల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

పాలకొల్లు సెంట్రల్: దళితులు ఒక వరంలా భావించే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీని తన స్వప్రయోజనాల కోసం దళితుల మధ్యే చిచ్చు పెట్టేలా మంత్రి నిమ్మల రామానాయుడు దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి బలం ఉన్న పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలిలో ఎంపీపీ ఉప ఎన్నికలను ఆపడం అధికార దుర్వినియోగమేనని ఆరోపించారు. ఇక్కడ వైఎస్సార్ సీపీకి 13, టీడీపీకి 3, జనసేనకు ఒకరు సభ్యులుగా ఉన్నారని, దీంతో ఓటమి తథ్యమని అన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ కంబాల సత్యశ్రీని ఎన్నికల ప్రదేశం నుంచి దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కూటమికి ఓటు వేయాలని బెదిరించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. స్టేషన్‌కు వెళ్లిన వైఎస్సార్ సీపీ నేతలు గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), యడ్ల తాతాజీ, చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, స్టాలిన్, పాలపర్తి కృపానాథ్, విజయ్, రేలంగి శ్రీను తదితరులకు సత్యశ్రీని అప్పగించగా కూటమి నేతలు మాటల్లో చెప్పలేని దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలే తమని తిట్టి తిరిగి తాతాజీ మమ్మల్ని కులం పేరుతో తిట్టారని టీడీపీ దళిత నాయకులు పీతల శ్రీను కేసు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గతంలో మంత్రి నిమ్మలను ఓ విషయంలో ఎదిరించిన సేవా దృక్పదం గల మల్లుల సురేష్ అనే వ్యక్తిపైనా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించారని గుర్తుచేశారు. రూ.240 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకునే మంత్రి రామానాయుడు, వైఎస్సార్ సీపీ హయాంలో రూ.475 కోట్లతో తీసుకొచ్చిన మెడికల్ కళాశాల పనులను ఎందుకు నిలుపుదల చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, 9 వేల మందికి ఇళ్ల స్థలాలు, సగం చెరువు బ్రిడ్జి, పాఠశాలల ఆధునికీకరణ, పట్టణంలో నూతన వాటర్ ఫిల్టర్ బెడ్ ఇలా వెయ్యి కోట్లు వరకు అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. ఇళ్ల స్థలాల పూడిక, మెడికల్ కళాశాలలో పూడిక పనులను అడ్డుకున్న ఘనత మంత్రి రామానాయుడికే దక్కుతుందని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు బండి సుందరరామూర్తి, ఉచ్చుల స్టాలిన్, ఖండవల్లి వాసు, బండి రమేష్, గంటా నరేష్, పాలపర్తి కృపానాథ్, మోకా నరసింహరావు, సందీప్, మంద హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత మేరకే రుణాలు ఇవ్వండి



బ్యాంకర్లతో మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: కాపు, బీసీ, ఇబీసీ కార్పొరేషన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేయాలని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యాపారాల నిమిత్తం రాయితీ రుణాలను కోరుతూ దరఖాస్తులు అందాయి. వీరికి వరుసగా మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు వార్డుల వారీగా జరుగనున్న నేపథ్యంలో కమిషనర్ బ్యాంకర్లతో సమావేశమయ్యారు. రుణాల ఇచ్చేందుకు ఇంటర్వ్యూల షెడ్యూలు ఖరారు తదితర విషయాల గురించి చర్చించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీతో పాటుగా , ఆధార్,రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాల నకలు కాపీలు వెంట తీసుకురావాలన్నారు.

ప్రాణాలను హరిస్తున్న వేగం



పెనుగొండ - మార్టేరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

పెనుగొండ: రయ్.. రయ్ మంటూ అతివేగం ప్రాణాలు హరించేస్తోంది. లేదంటే క్షతగాత్రులను చేసి మంచం పాల్జేసి కుటుంబాన్ని ఆర్థిక భారంలో ముంచేస్తోంది. ముఖ్యంగా యువత టిప్పర లారీల వేగాన్ని మించి బైక్‌లను నడపడం ప్రమాదాలకు తావిస్తోంది. ఆచంట నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రమాదాలతో రోడ్డు ఎక్కాలంటే ప్రజలు హడలి పోతున్నారు. కొద్దికాలంలోనే నలుగురైదుగురు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులు ఆసుపత్రుల పాలయ్యారు. కేవలం వారం రోజుల్లోనే పెనుగొండలో ఆసుపత్రుల పాలై లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితం ఏర్పడడం ఆయా కుటుంబాలను అప్పుల్లోకి నెట్టేసింది. ఒక్క నెగ్గిపూడి - మార్టేరు రహదారిలోనే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మార్టేరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దంత వైద్యుడు, లాకుల సమీపంలో పెనుగొండ కళాశాల విద్యార్థి, పంచాయతీ వద్ద ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు మృత్యువాత పడ్డారు. సిద్ధాంతం శ్రీజ్ఞాన సరస్వతీ సాయినాథుని ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధాంతానికి చెందిన ఓ యువకుడు ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. ఆలమూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.

మంచం పడుతున్నారు

యువత మోటారు సైకిళ్ల వేగానికి సంభవించిన ప్రమాదాలతో క్షతగాత్రులై మంచాల పాలయ్యారు. పెనుగొండ కళాశాల కూడలి వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఓ ఏఎస్ఎం మంచం పాలైంది. నడవలేని స్థితికి చేరుకొంది. ఓ వృద్ధుడు తొడఎముక విరిగి పోవడంతో మంచం పట్టారు. పెనుగొండ మెయిన్ బజారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి ముఖం పూర్తిగా గాయపడి నానావస్థలు పడుతున్నాడు. దాదాపుగా ఏడెనిమిది లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. పెనుగొండ ఏఎంసీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలోనూ మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. మితిమీరిన వేగంతో మోటారు సైకిళ్లు నడపడంతోనే ఆయా వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద నివారణకు కళాశాల కూడలి వద్ద స్పీడు బ్రేకర్లు వేసినా యువత వేగానికి కళ్లెం పడడంలేదు. వేగ నియంత్రణకు చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని పలువురు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు మంగళం



సమావేశంలో మాట్లాడుతున్న జయ సరిత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం బయట నుంచి చూసినప్పుడు అనేక పథకాలు ఇవ్వాలని అనుకున్నానని, అధికారంలోకి వచ్చిన తరువాత ముందు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందని గ్రహించానని సీఎం చంద్రబాబు చెప్పడం రేవు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ఆరోపించారు. మంగళవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు బడ్జెట్‌లో రూ.7 లక్షల కోట్ల అప్పే ఉందని ప్రకటించడం ఆయన అబద్ధాల నిదర్శనమన్నారు. 45 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు అధికారం కోసం ఎంత నీచానికైనా దిగజారతారని విమర్శించారు. సూపర్ సిక్స్‌కు మంగళ పాడేసిన ట్టేనని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, గొర్రెల రాంబాబు, మామిడిశెట్టి చిట్టిబాబు, జోగి వెంకటేశ్వరరావు, రామాంజుల చిన్నమదు, సందీప్, కుసుమ, హేమలత, హైమావతి, జ్యోతిలు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణంపై లయన్స్ క్లబ్‌లో సమావేశం



లయన్స్ కమ్యూనిటీ హాలులో ఉత్సవాల ఏర్పాటుచేసిన సమావేశం

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో వారం రోజుల్లో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో సమావేశం ఏర్పాటుచేశారు. విశాలమైన ఆలయ ప్రాంగణం ఉండగా ఎక్కడో లయన్స్ హాలులో సమావేశం ఏర్పాటు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఎప్పుడూ లేనిది కొత్త సంస్కృతి తీసుకొస్తున్నారా అంటూ భక్తుల ప్రశ్నిస్తున్నారు. సహజంగా కార్తీకమాసం, శివరాత్రి, దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యే సమయంలో ఆలయంలో రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, ఫైర్ ఇలా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తుంటారు. భక్తులు కూడా పలు సూచనలు సలహాలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక వేత్తలు, ఆలయ అధికారులు కొత్త సంస్కృతిని తీసుకొచ్చారంటూ విమర్శిస్తున్నారు.

వృత్తి నైపుణ్యాలకు శిక్షణ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గా ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ వర్కర్స్ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి దుర్గాప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక వీవర్స్ కాలనీ సమతా మహిళా విజ్ఞాన భవనంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ మానెం బసవరాజు అధ్యక్షతన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక టెక్నాలజీతో పోటీ పడాలంటే ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు. 1998 నుంచి దేశ వ్యాప్తంగా కార్మికుల సంక్షేమానికి కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రసూతి, మరణం, వైద్యం, వివాహం తదితర ఆర్థిక ప్రయోజనాలు అమలులో ఉండేవని తెలిపారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో వీటిని నిలుపుదల కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వీటిని అమలులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్, మామిడి ధాన వరప్రసాద్, జిల్లా కార్యదర్శి నల్ల శివకుమార్, ట్రెజరర్ జమితార చంద్రశేఖర్, బండి దుర్గాప్రసాద్, హరినాథ్ బాబా, గుబ్బల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భవిత దివ్యాంగులకు భరోసా

- ఆటిజంపై అపోహలొద్దు
- నేడు ప్రపంచ ఆటిజం దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పిల్లలు పరిసరా లను అర్థం చేసుకోవడంలో లోపాలు, ఇతరులతో స్పందించక లేకపోవడాన్ని ప్రభావితం చేసేదే ఆటిజం. విదేశాలలో, సంపన్న కుటుంబాలకు చెందిన సమస్యగా ప్రతి ఒక్కరు భావిస్తుంటారు. కానీ దేశాలు, ఆర్థిక తారతమ్యాలతో నిమిత్తం లేకుండా ఇప్పుడిది ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది పిల్లల్లో ఎక్కువగా కలవరపెడుతోంది. పూర్తిగా నయమయ్యేది కాకపోయినా తగు సమయంలో చికిత్స అందజేస్తే దీని బారిన పడిన పిల్లలు మామూలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. ఆటిజం మీద అపోహలు, అపార్థాలు తొలగించకోవడం నేటి తక్షణావసరం.

అసలు ఏలా ఏర్పడుతోంది:

పిల్లలను సరిగా పెంచకపోవడం. ప్రేమ అప్యాయత చూపకపోవడం వల్ల ఆటిజం వస్తుందనేది పెద్ద అపోహ. నిజానికి ఇదో నాడీ మండలంలో ఎదుగుదల సమస్య. పుట్టినప్పటి నుంచే, ఆ మాటకొస్తే తల్లి కడపులో ఉన్నప్పటి నుంచే పిల్లల మెదడులో నాడీ కణాలు ఉత్పత్తి కావడంలో, సమాచార ప్రసారంలో తలెత్తే లోపాలు కారణంగాను, జన్యు, ఎంజైమ్‌లు, పర్యావరణ అంశాల పాత్ర వల్ల ఆటిజం వస్తుంది.

లక్షణాలు:

మాటలు ఆలస్యం కావడం, పూర్తి వాక్యా లను పలకలేకపోవడం, వస్తువులను వేలితో చూపించడం, పిల్లల పేర్లు పెట్టి పిలిచినా స్పందించకపోవడాన్ని, తోటి పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉండేవారు, ఇతర లక్షణాలతో బాధపడే దివ్యాంగులలో ఏర్పడే మానసికంగా లోపమే ఆటిజంగా పిలుస్తారు. ఈ ఆటిజం ఉన్నవారు వాళ్లలో వాళ్ల మాట్లాడుకోవడం, వాళ్ల లోకంలో వాళ్లు ఉండడం, కళ్లలోనికి నేరుగా చూడలేకపోవడం, వింత శబ్ధాలు చేయడం, చిన్న శబ్దాలను తట్టుకోలేకపోవడం, ఒకటే పనిని తరుచుగా చేయడం, అకస్మాత్తుగా కోపం, తీవ్ర గందరగోళం వంటి లక్షణాలు కలిగి ఉండటం చేస్తారు.

దన్నుగా నిలవడం ముఖ్యం:

ఆటిజం పిల్లల ప్రవర్తన భిన్నంగా ఉండటం వల్ల రెండు, మూడేళ్ల లోపే గుర్తించి అప్పుడే చికిత్స ఆరంభించడం ముఖ్యం. మాటలు నేర్పించడం, వారి పనులు వారు చేసుకునేలా శిక్షణ, ప్రత్యేక చదువు, జీవనస్రవంతిలో కలిపేందుకు చూడటం, ఇలా పలు అంశాలలో శిక్షణ ఎంతో అవసరం.

ఏప్రిల్ 2వ తేదీన ప్రపంచ ఆటిజం దినోత్సవం

పుట్టిన నాటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఆటిజం వస్తుంది. వీరి కోసం ఏప్రిల్ 2వతేదీన ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆటిజం ఉన్న పిల్లలు పశ్చిమ గోదావరి జిల్లాలో 450 మంది వరకు ఉన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ద్వారా ఆయా భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు ఉచితంగా అందజేస్తున్నారు. ఇటువంటి పిల్లల కోసం భవిత సెంటర్లు చక్కగా పనిచేస్తున్నాయి. వారి కోసం ప్రత్యేక శిక్షణతో పాటు యోగ, ధ్యానం, ఆట పాటలు ద్వారా పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. వివిధ రకాల ఆక్టివిటీస్ ద్వారా పిల్లల్లో నైపుణ్యాలను పెంపాదించడం, పిల్లల్లో చదువుపై ఆసక్తిని కలిగిస్తున్నారు. తల్లిదండ్రులకు సైతం ఇంటి వద్దే ప్రత్యేక శిక్షణ కల్పించడం ద్వారా పిల్లల్లో మంచి మార్పులు కోసం కృషి జరుగుతుంది. సదుపాయాలను ఆటిజం పిల్లలు తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.



దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక బోధన చేస్తున్న భవిత సెంటర్ నిర్వాహకులు

ఒంటరిగా ఉండేవాడు



మా అబ్బాయి పేరు తేజ సాయి గణేష్, వయస్సు 6 సంవత్సరాలు. పుట్టుకతో ఆటిజం లక్షణాలతో జన్మించడం జరిగింది. గణేష్ తనకు తాను మాట్లాడుకోవడం, ఒంటరిగా ఉండటం, ఎవరితోనూ కలిసివాడు కాదు. సంవత్సరంగా భవిత సెంటర్‌కు తీసుకువెళుతున్నాం. అక్షరాలు దిద్దుతున్నాడు. అంకెలు, పదాలు జత చేయడం, అందరితో కలిసి ఆడుతున్నాడు. సమగ్ర శిక్షకు ప్రత్యేక ధన్యవాదాలు

– సారిక ఉషా, తేజ సాయి గణేష్ తల్లి

ఘనంగా గ్రామ దేవతల జాతర



మాణిక్యాంబ అమ్మవారు



కనకదుర్గమ్మవారు

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామ దేవతలు కనకదుర్గమ్మ, మాణిక్యాంబ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం అమ్మవార్లకు కుంకుమ పూజలు, శ్రీచక్రానికి అర్చనలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి భక్తులు గరగల నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ చలివిడి, పానకాల కావిడిలు అమ్మవార్లకు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటున్నారు. గత నెల 30న ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 3న గోదావరిలో తెప్పోత్సవం అనంతరం దండాడింపు కార్యక్రమంతో ముగియనున్నాయి. గురువారం సాయంత్రం దాతల ఆర్థిక సహకారంతో భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేయనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

తణుకు అర్బన్: డ్రైవింగ్ వృత్తిలో ఉన్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. కాలేజీ బస్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అమర వీరుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యాజమాన్యాలు వేతనాలు పెంచాలని కోరారు. డ్రైవర్లుకు వ్యతిరేకంగా వచ్చిన చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. అనంతరం ఇటీవల చనిపోయిన డ్రైవర్ పేకెటి మూర్తి బాబు కుటుంబానికి డ్రైవర్లు అందరూ తమకు తోచిన ఆర్థిక సహాయంగా సేకరించిన రూ. 50వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

లంక భూములు పంచే వరకు పోరాటం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెనుగొండ: సిద్ధాంతం మధ్యస్థ లంకలో పెరుగు భూములు దళిత పేదలకు పంపిణీ చేసే వరకు పోరాడతామని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దారు జి.అనిత కుమారికి వినతి పత్రం అందజేశారు. లంక భూముల పంపిణీలో అవసరమైతే ప్రాణత్యాగాలకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. లంక భూములు అక్రమ తవ్వకాలు చేపట్టడానికి ఎదురు చూస్తున్న రాబంధులకు అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళిత పేదలకు సి పట్టా భూములు ఇచ్చిన తరువాత, ఇప్పటి వరకు సెంటు భూమి కూడా పేదలకు దక్కలేదని వివరించారు. 80 ఎకరాలు ఉన్న సిద్ధాంతం పెరుగులంక భూములను సిద్ధాంతం దళిత పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు, నాగిశెట్టి గంగారావు, గుమ్మడి భాను, రాజు, చిక్కాల చిన్న, ముత్తాబత్తుల ప్రసాద్, చింత శ్రీను, కుసుమే వెంకటేశ్వరరావు, నక్కా స్వామి, నేలపూడి నాగేశ్వరరావు, గడ్డం శ్రీనుబాబు, బత్తుల దుర్గా ప్రసాద్, గడ్డం చంటిబాబులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



ఆలయం వద్ద అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం దేవునితోట భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం స్వామి వారికి సింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో గ్రామానికి చెందిన దొంగ వీరవెంకట సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, వారి కుమారులు దొంగ రామచంద్ర శేఖర్, సుజాత, దొంగ మురళీకృష్ణ, అశ్వని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల ఆర్థిక సాయంతో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జుత్తిగ నిశాంత్, చింతపల్లి సత్యనారాయణ, సత్యవతి, దేవునితోట యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పంట బోదె బాగుచేత



రైతులు బాగుచేసిన పంట బోదె

నరసాపురం రూరల్: మండలంలోని చామకూరి పాలెం గ్రామం మోడిలో ఆక్వా సాగు కారణంగా వరి సాగు పది ఎకరాలకే పరిమితమైంది. ఈ వరి సాగుకు నీరందకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా సుమారు పావు కిలో మీటరు మేర ఉన్న బోదెను శుభ్రం చేసుకున్నారు. వేములదీవి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తమ్మిరాజు డ్యామ్ వరకు ఉన్న ఈ బోదెలో పూడిక తీశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని రైతు గుబ్బల మోహనరావు తెలిపారు. ఎల్బీచర్ల పుంతను ఆనుకుని ఉన్న పంట బోదె పూడిక తీత పనుల్లో మల్లుల నాగరాజు, నాగ పెద్దిరాజు, కవురు పండు, మల్లుల సుబ్బారావు, బొక్కా పండు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): నియోజకవర్గంలోని, పట్టణంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు సోషల్ పరీక్ష జరిగింది. పట్టణంలో 8 రెగ్యులర్, ప్రైవేట్ సెంటర్‌లలో జెడ్పీ, సుబ్బారావుపేట మునిసిపల్, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలు, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్ జోన్స్ సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించారు. మండలంలో మాధవరం జెడ్పీ, ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, కొమ్ముగూడెం జెడ్పీ, పెద్దతాడేపల్లి జెడ్పీ, పెంటపాడు మండలం మీనవల్లూరు, అలంపురం, పెంటపాడు జేపీబీఎస్, జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు.